ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 సంచిక : 01 సెప్టెంబర్ 2013


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-07-2013, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు వ్యాసపూర్ణిమ అంటే వ్యాసుడు శరీరం ధరించిన రోజు. నారాయణుడే వ్యాసుడిగా వచ్చాడు అని మన సాంప్రదాయం చెపుతుంది. ఆయన వేదాలను విభజించాడు కాబట్టి వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. ఆయన భారతం వ్రాసాడు, భాగవతం వ్రాసాడు. ఆయన సర్వజ్ఞుడు. ఆయనది విశాలమైన బుద్ధి. సముద్రం అంత లోతైన హృదయం. అన్ని మార్గాలకు, అందరి మనస్థత్వాలకు చోటుఇచ్చిన హృదయం, పరదూషణ తెలియనివాడు. ఇతరులు నీకు ఏమి చెయ్యకూడదని నువ్వు అనుకొంటున్నావో అది నువ్వు ఇతరులకు చెయ్యకు అని చెప్పాడు. అటువంటి మహాత్ముడి యొక్క జయంతిరోజున మనం ఇక్కడ కలుసుకున్నాము. వ్యాసుడు భారతం వ్రాసి ముగింపులో ఒక వాక్యం చెప్పాడు. అది ఆశ్చర్యంగా ఉంటుంది. ఆయన ముగింపులో ఏమన్నాడు అంటే "భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడాలేదు, ప్రపంచంలో లేనిది భారతంలో ఉంది" అని చెప్పాడు. అంటే ఎంత ఆత్మవిశ్వాసం ఉంటే ఈ వాక్యం చెప్పగలడో చూడండి. ఆయన కుమారుడే శుకమహర్షి. వైరాగ్యంలో శుకుడికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. మీకు ఎంత చదువు ఉన్నా, ఎన్ని యోగాభ్యాసాలు చేసినా, ఎంత నిష్కామకర్మ చేసినా అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా మీకు స్వరూపజ్ఞానం కలుగదు అని భగవంతుడు చెప్పాడు. మేము చాలా చదువుతున్నాము, సాధనలు చేస్తున్నాము కాని మాకు ఏమీ తెలియటం లేదు అంటే దానికి వైరాగ్యం


రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ .... 22-07-2013

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

లేకపోవటమే కారణం.

బుద్ధుడు మన అవతారపురుషులలో ఒకడు అయినప్పటికీ మనం కృష్ణుడిని పూజించినట్లు, రాముడిని పూజించినట్లు బుద్ధుడిని పూజించము. బుద్ధుడు మోస్ట్ ఇంపెర్సనల్ మేన్. బుద్ధుడు ఈ భూమి మీదకు వచ్చాడు, ఆయన మహాత్ముడు అని ఎవరూ చెప్పకోనక్కరలేదు ఆయనకు. ఆయన టీచింగ్‌ను ఫాలో అవ్వండి. బుద్ధుడి టీచింగే మీకు గైడెన్స్. ఆయన చివరిరోజులలో మోషన్స్ పట్టుకొని శరీరం విడిచిపెట్టారు. బుద్ధుడి కూడా ఆయన సవతి తమ్ముడు ఆనంద్ ఉండేవాడు. మీకు మోషన్స్ తగ్గటంలేదు, మీరు శరీరం విడిచిపెట్టేలాగ ఉన్నారు, మీ శరీరాన్ని ఏమి చెయ్యమంటారు అని బుద్ధుడిని ఆనంద్ అడిగాడు. అప్పుడు బుద్ధుడు అమృతతుల్యమైన మాటలు చెప్పాడు. "ఆనంద్ ఇప్పుడు మనం ఒక గ్రామంలో ఉన్నాము కదా. ఏ గ్రామం అయినా స్మశానం లేకుండా ఉంటుందా? ఈ గ్రామంలో కామన్‌మేన్‌ని ఏ స్మశానంలో అయితే దహనం చేస్తున్నారో బుద్ధుడి శరీరాన్ని కూడా అక్కడే దహనం చేయండి, ఈ దేహానికి ఏమీ ప్రత్యేకత అక్కరలేదు" అని చెప్పాడు. వాడు బుద్ధుడు. ఆనంద్ ఏమన్నాడు అంటే "మీరు శరీరం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. బహుశా మీలాంటి మహాత్ముడు ఇంతవరకు ఈ భూమి మీద ఎవడూ నడవలేదు" అన్నాడు. బుద్ధుడు ఏమన్నాడు అంటే "ఆనంద్ తొందరపడి ఇటువంటి మాటలు మాట్లాడకూడదు. నువ్వు ప్రపంచ చరిత్ర చదువుకొన్నావా? ప్రపంచ చరిత్ర చదవకుండా, ప్రపంచం యొక్క సాహిత్యం తెలియకుండా బుద్ధుడి అంతటివాడు ఈ ప్రపంచంలో ఎవడూ లేడు అని తీర్పు చెప్పటం అన్యాయం, అటువంటి తీర్పులు చెప్పవద్దు" అని చెప్పాడు. బుద్ధగయలో ఆయనకు ఎన్‌లైటెన్‌మెంట్ వచ్చినా కాశీకి ఆరుమైళ్ళ దూరంలో ఉన్న సారనాథ్‌లో ఆయన ఫస్ట్ టీచింగ్ చేసారు.

**"బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి". బుద్ధం శరణం గచ్ఛామి** అంటే అక్కడ బుద్ధుడు అంటే ఒక వ్యక్తికాదు, ఆయన పొందిన స్థితికి మీరు శరణాగతి చెయ్యండి. అంటే నిర్వాణస్థితిని మీరు గమ్యంగా పెట్టుకోండి, దానిని శరణు వేడుకోండి, ఆ స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యండి. అంతేగాని చిల్లర విషయాలలోనికి వెళ్ళి మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అంటే రోజులు గడిచేకొలది చావు దగ్గరకు వస్తోంది అన్న సంగతి మర్చిపోతున్నారు. అదే మాయ. **సంఘం శరణం**

**గచ్ఛామి** ఇక్కడ సంఘం అంటే ప్రపంచం అనికాదు, ప్రపంచంలో ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యండి. సంఘం అంటే హోలీ కంపెనీ. మన హృదయంలో ఒక సత్యం ఉంది. దానితో కలిసి ఉండలేకపోతున్నాము కాబట్టి బాహ్యంగాఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యండి. **ధర్మం శరణం గచ్ఛామి** మీకు ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మమార్గాన్ని విడిచిపెట్టవద్దు. ధర్మాన్ని ఆచరించటంలో మీకు అనేక కష్టాలు, నష్టాలు రావచ్చు అయినా ధర్మాన్ని విడిచిపెట్టకండి. ధర్మమార్గాన్ని అనుసరిస్తే మనం నష్టపోతాము అని మీరు అనుకోవద్దు. దాని వలన మీకు శాంతి కలుగుతుంది. మీకు ఎంత ధనం ఉన్నా శాంతిలేకపోతే ఆ ధనాన్ని ఏమి చేసుకొంటారు. మీకు ఇంట్లో ఎంత ధనం ఉన్నా యు మస్ట్ బి పూర్ అండ్ ప్యూర్ ఇన్ ద హార్ట్. మీకు ఇంట్లో ఎంత ధనం ఉన్నా ఆ ధనం మీరు కాదు. ఈ శరీరాన్ని విడిచి పెట్టి బయటకు వెళ్ళినప్పడు అంటే మరణానంతరం మీ కూడా గుండుసూదిని కూడా పట్టుకొని వెళ్ళలేరు. అందుచేత మీకు ఎంత ధనం ఉన్నా ఆ ధనాన్ని మనస్సులో మొయ్యవద్దు. హృదయంలోమటుకు పవిత్రంగా ఉండండి, బీదవారికిందే ఉండండి. డబ్బు అనేది బాహ్యమైన విషయం, అది లోపలవిషయంకాదు. ధర్మాన్ని అతిక్రమించిన వాళ్ళను ఆదర్శంగా పెట్టుకోవద్దు. అవతారపురుషులను, జ్ఞానులను, యోగులను ఆదర్శంగా పెట్టుకోండి. అందుచేత మీకు ఇంట్లో ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ ధర్మమార్గాన్ని అతిక్రమించకుండా, దానిని అనుసరిస్తే ధర్మమే మిమ్మల్ని రక్షిస్తుంది. అందుచేత ఎట్టిపరిస్థితులలోను మీరు ధర్మమార్గాన్ని విడిచిపెట్టవద్దు.

బుద్ధుడు మోస్ట్ కంపేషనేట్‌మేన్. వాడు నడుస్తూ ఉంటే కంపేషన్ నడుస్తోందా అని మనకు అనిపిస్తుంది. బుద్ధుడు అంతటి దయామయుడు మనకు ఈ భూమి మీద కనబడడు. ఇప్పుడు అందరికీ గుర్తింపులు కావాలి, గౌరవాలు కావాలి. అది ఒక మాయ. ఈ గౌరవాలు, అగౌరవాలు, కష్టాలు, నష్టాలు, సుఖాలు, దుఃఖాలు ఇదంతా ప్రకృతి. మీరు ఏ కులంలో పుట్టినా, ఏ మతంలో ఉన్నా, ఏ మార్గంలో ప్రయాణం చేసినా ప్రకృతిగుణాలను దాటకుండా ఎవడికీ బ్రహ్మజ్ఞానం కలుగదు, కలుగదు, కలుగదు. మనం ఎవరికైనా నిమ్మకాయ ఇస్తే జీవితం పొడుగునా జ్ఞాపకం పెట్టుకుంటాము. తల్లి కూతురికి ఎకరం ఇస్తే మా అమ్మాయికి ఎకరం ఇచ్చాను అని రోజూ చెపుతుంది. కూతురు తల్లికి ఏదైనా ఇస్తే మా అమ్మను ఎవరు చూస్తారు? నేనే చూస్తున్నాను అంటుంది. బుద్ధుడు చెప్పిన ఒక వాక్యం చెపుతాను, ఇది జ్ఞాపకం పెట్టుకొంటే బుద్ధుడు అంటే ఏమిటో మీకు తెలుస్తుంది. బుద్ధుడు

రాజ్యాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చేసాక "నేను రాజ్యాన్ని విడిచిపెట్టేసాను అనే తలంపు, ఆ డిస్ట్రబెన్స్ ఎప్పుడు కూడా నా బ్రెయిన్‌లోనికి రాలేదు" అని చెప్పాడు. ఈ ఒక్క వాక్యం గుర్తుపెట్టుకుంటే బుద్ధుడి యొక్క ఔన్నత్యం మనకు తెలుస్తుంది. కర్మయోగానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత బుద్ధుడు ఇవ్వలేదేమో అని గాంధీగారు అన్నారు. డ్యూటీని చెయ్యవద్దు అని బుద్ధుడు చెప్పలేదు, తగుమాత్రంగా చేసుకుంటూ సాధన ఎక్కువగా చేయమని చెప్పాడు. గాంధీగారు కర్మయోగి కాబట్టి ఆ కోణంలో చూసినప్పుడు గాంధీగారికి బుద్ధుడు అలా కనిపించి ఉండవచ్చు. గాంధీగారు కర్మయోగం ద్వారా తరించారు. మనం సిన్సియర్‌గా ఏ యోగాన్ని అనుసరించినా గమ్యాన్ని చేరుకొంటాము. ఈ క్రింది శ్లోకంలో భగవంతుడు నాలుగు యోగాలను సమన్వయం చేసి చెప్పాడు. ఇది ఆచార్యులవారికి ప్రియమైన శ్లోకం.

**మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః సంగవర్జితః**

**నిర్వైరః సర్వభూతేషు యస్స మామేతి పాండవ (11-55)**

**మత్కర్మకృత్** ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే నాకు సంతోషం కలుగజేసే పనులు, నాకు ప్రీతి కలిగించే పనులు చేయండి. మీరు ఏ రకంగా పనిచేస్తే నా దయ మీకు కలుగుతుందో ఆ రకంగా పనిచెయ్యండి అని చెపుతున్నాడు. కాని మనం ఏమి చేస్తాము అంటే భగవంతుడు సంతోషించే పనులు చేయము. మన అహంకారం తృప్తిపడాలి. మనం అహంకారం తృప్తిపడితేనే ఆ పనిచేస్తాము లేకపోతే వదిలేస్తాము. నేను చెప్పానని మీరు నమ్మవద్దు. ఇంటికి వెళ్ళి ఆలోచించుకోండి. మన మనస్సును ఒక ప్రక్కన పెట్టి కేవలం ఈశ్వరుని దయను సంపాదించటంకోసం పనిచేసే అలవాటు మనకు చాలా తక్కువ. ఎవరో కొంతమంది పూర్వజన్మ సుకృతం ఉన్నవారు మాత్రమే అలా పనిచేస్తారు. భగవంతుడి అనుగ్రహం ఉంటే అన్నీ సాధ్యమే. ఆయన అనుగ్రహం ఉంటే మీరు ఏమీ అడగకుండానే మీకు కావలసినవన్నీ ప్రసాదిస్తాడు.

**మత్పరమః** మీరు నన్ను గమ్యంగా పెట్టుకోండి. నన్ను గోల్‌గా పెట్టుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. మనం వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళుతున్నాము. మనకు వెంకటేశ్వరస్వామి ముఖ్యంకాదు. ఆయన దగ్గరకు వెళితే, ఆయనను దర్శిస్తే మన కోరికలు నెరవేరతాయి అనుకొంటాము. ఇదొక వ్యాపారం అయిపోయింది. మనకు నిజంగా వెంకటేశ్వరస్వామి

మీద ప్రేమ ఉంటే మంచిదే కాని అలా లేదు. మన కోరికలు నెరవేరటానికి ఆయనను ఒక మీన్స్ కింద పెట్టుకొన్నాము. ఈసారి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లినప్పుడు నేను చెప్పింది సత్యమో, అసత్యమో మీ అంతట మీరే చూసుకోండి. భగవంతుడు కాదు మనకు కావలసింది మన కోరికలే మనకు ముఖ్యం. భగవంతుడిని ధ్యానం చేస్తున్నాము అని చెప్పి మనం చేసేది ఏమిటి అంటే మన కోరికలను మనం ధ్యానం చేసుకొంటున్నాము.

మీరు నన్ను గమ్యంగా పెట్టుకోండి అంటే నేనే మీ సాధన, నేనే మీ గమ్యం, అన్నీ నేనే అంటున్నాడు పరమాత్మ. మీకు ఎప్పుడైనా కష్టాలు వచ్చినా మీ బలహీనతలు పోగొట్టటానికే ఆ కష్టాలు వస్తూ ఉంటాయి. మీ జీవితంలో ఒకోసారి పొంగువస్తూ ఉంటుంది, ఒకోసారి కుంగిపోవటం వస్తూ ఉంటుంది, అప్పుడు సమానంగా ఉండాలి. ప్రారబ్ధాన్నిబట్టి శరీరం నడుస్తూ ఉంటుంది. ప్రారబ్ధానికి శరీరాన్ని వదిలేసి మీ డ్యూటీ మీరు చెయ్యాలి. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న నన్ను పొందటానికి ప్రయత్నం చెయ్యండి అని పరమాత్మ చెపుతున్నాడు. అర్జునుడు కృష్ణుడిని సారథిగా పెట్టుకొన్నాడు. అలాగే మీరు కూడా మీ జీవితానికి కృష్ణుడిని సారథిగా పెట్టుకొంటే మీకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది, మీరు తరిస్తారు.

**మద్భక్తః** నువ్వు నాకు భక్తుడిగా ఉండు. నన్ను ఉపాసన చెయ్యండి అని పరమాత్మ చెపుతున్నాడు. ఉపాసన లేకుండా మోక్షంరాదు. నీ మనస్సును ఒక ప్రక్కన పెట్టి హృదయంలో భగవంతుడిని ప్రేమిస్తూ ఉంటే నీ మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. నిరంతరం నా రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, నా నామాన్ని స్మరిస్తూ ఉంటే నీ మనస్సు అరెస్టు అయిపోతుంది, దాని వాండరింగ్ తగ్గిపోతుంది. నా మీద నీకు ఇష్టం లేదు అనుకో, ఇష్టపడటం నేర్చుకో. నన్ను ప్రేమించు, నన్ను ఇష్టపడు, నాకు దగ్గరగా ఉండు అని పరమాత్మ అడుగుతున్నాడు. మన మనస్సు యొక్క వాండరింగ్ తగ్గించటానికే ఇలా అడుగుతున్నాడు. మనస్సు యొక్క వాండరింగ్ తగ్గితే మనం హేపీగా ఉండగలము. భగవంతుడిమీద మనకు నిజంగా ప్రేమ కుదిరితే 24 గంటలు 24 క్షణాల కింద వెళ్లిపోతుంది. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే మీకు నిజంగా నేను కావాలంటే మీ మనస్సును తీసి ఒక ప్రక్కన పెట్టండి. కోరికలు, కోపాలు, రాగద్వేషాలు మొత్తం డస్ట్ అంతా మనస్సులోనే ఉంది. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టండి. అది దారి ఇస్తేగాని మీరు గమ్యానికి వెళ్లలేరు.

**సంఘవర్జితః** ఆసక్తి దోషం వద్దు. మీ డ్యూటీ ఏదో మీరు చెయ్యండి. కర్మ చెయ్యటం మనవంతు, ఫలితం ఎలా ఉంటుందో మనం చెప్పలేము. అందుచేత డ్యూటీ విడిచిపెట్టవద్దు. ప్రాపంచిక విషయాలమీద ఎక్కువ ఆసక్తి పెట్టుకోవద్దు. మన చుట్టూ సమాజం ఉంది. ఆ సమాజంతో అతిగా ఉండకూడదు, తగుమాత్రంగా ఉండాలి. మీరు ఏదైనా చేయగలిగితే చెయ్యండి. అంతేగాని నేనేదో ఈ ప్రపంచాన్ని ఉద్ధరిస్తున్నాను అనే భావన ఎప్పడూ పెట్టుకోవద్దు. దేరీజ్ ఈశ్వర. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచాన్ని ఎవడు చూసాడో, నువ్వు చనిపోయాక కూడా వాడే చూస్తాడు. నేను ఈ ప్రపంచాన్ని ఉద్ధరిస్తాను అని అనుకోవద్దు. ముందు నిన్ను నువ్వు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీలో శక్తి లేకుండా, నీలో నాలెడ్జ్ లేకుండా, నీలో సేవాభావన లేకుండా అసలు నువ్వు ఎవరిని ఉద్ధరిస్తావు. మనిషి వాడంతట వాడు బాగుపడాలి అనుకుంటే నువ్వు ఏదైనా సహాయం చెయ్యవచ్చు లేకపోతే ఏమి చేయగలం? ఎవరికైనా బాగుపడటానికి నువ్వు అవకాశాలు ఇవ్వవచ్చు, వాటిని ఉపయోగించుకుని వాళ్ళే బాగుపడాలి కాని నువ్వు బలవంతాన వారిని బాగుచేయలేవు. అది లోపల నుండి రావాలి. జ్ఞానం అనేది కూడా లోపల నుండి ఊరేదే కాని అది పైనుండి నీరు పోసినట్లు పోసేదికాదు.

**నిర్వైరః సర్వభూతేషు** వైరానికి కారణం ఉన్నా, విరోధాలకి కారణం ఉన్నా నువ్వు దేనితోటి, ఎక్కడా విరోధం పెట్టుకోవద్దు. నిన్ను ఎవరైనా విరోధి అనుకున్నా, నువ్వు ఎవరితోటి విరోధంగా ఉండవద్దు. నువ్వు విరోధి అని వాళ్ళు అనుకోవచ్చు, అనుకొంటే అనుకోనియ్యి. నాకు ఫలానా వాళ్ళు విరోధులు అని నువ్వుమటుకు అనుకోవద్దు. విరోధాలకు కారణం ఉన్నప్పటికి నువ్వు విరోధం పెట్టుకోకుండా ఉంటే అప్పుడు మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. మనస్సుకు లోచూపు కలుగుతుంది. నువ్వు ఎక్కడ వైరం పెట్టుకొన్నా నీ మనస్సు బాహ్యముఖానికి పోతుంది. స్నేహాలు, విరోధాలు ఇవి అన్నీ ప్రకృతి. వీటిని అతిక్రమించకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. అహింసను కనుక మీరు ప్రాక్టీసు చేస్తే క్రూరజంతువులు కూడా మీకు అపకారం చెయ్యవు. భగవాన్ దగ్గరకు పులులు, చిరుతలు అనేకం వచ్చేవి. వాటిని చూసి ఆయన పారిపోలేదు, స్టడీగా ఉండేవారు, అవే వెనక్కి వెళ్ళిపోయేవి. అందుచేత ఓ పాండవా! నువ్వు ఈ రకంగా ఆ లక్షణాలను కనుక ప్రాక్టీసు చేస్తే అవి నీకు వచ్చేస్తాయి. నాకు రావు అని అనుకోవద్దు. జ్ఞాని దేనినయితే పొందాడో వాటిని మనం ప్రాక్టీసు చెయ్యాలి.

మనస్సుతో మనం విరోధం పెట్టుకొంటే అదే మనలను పాడు చేస్తుంది. అందుచేత మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు. మనస్సుతో స్నేహంగా ఉండాలి, దానిని మనకు అనుకూలంగా తిప్పకోవాలి. మనస్సును నియమించుకోవాలి. మనస్సును జయించాలి అంటే చేప నీటి ప్రవాహానికి ఎలా ఎదురు ఈదుతుందో అలా మనోప్రవాహానికి ఎదురు ఈదాలి. మనోప్రహానికి ఎదురు ఈదితే మనస్సు దాని మూలంలోనికి వెళ్ళి అక్కడ ఉన్న నారాయణుడిలో ఐక్యమైపోతుంది.

మనిషిని గదిలో పెట్టి తాళం వేసినట్లు మీ మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో పెట్టి తాళం వేయండి. అప్పడు మనస్సు యొక్క వాండరింగ్ తగ్గిపోతుంది. ఇక్కడ కృష్ణుడు ఒక రహస్యం చెప్పాడు. మీకు కర్మఫలం ఆశించకపోయినా ఫలం వస్తుంది. కర్మఫలాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తూ ఉంటే మనస్సుకు చాపల్యం వచ్చేస్తుంది, మీరు దానిని ఆపలేరు. కర్మఫలాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పనిచేస్తే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. అంటే కర్మఫలాన్ని మరిచిపోయి కర్మ చెయ్యండి. మనం కర్తృత్వం పెట్టుకొని పనిచేస్తే, అహంభావనతో పనిచేస్తే మన శరీరం తొందరగా టైర్అయిపోతుంది. కర్మను యోగంగా చేస్తే వారు ఎక్కడా టైర్ అవ్వరు. బల్బులేకపోతే కరెంటు ఉన్నా వెలుతురు ఎక్స్‌ప్రెస్ అవ్వదు. అలాగే మన మనస్సులో ఉన్న గుణాలు ఎక్స్‌ప్రెస్ అవ్వాలంటే శరీరం ఉండాలి. శరీరం లేకపోతే గుణాలు ఎక్స్‌ప్రెస్ అవ్వటానికి అవకాశం లేదు. అందుచేత మనస్సు ఉన్నంతసేపు శరీరాలు వస్తూనే ఉంటాయి. పూర్తిగా నీకు మనోనాశనం అయితే గాని పునర్జన్మలు ఆగవు.

కొంతమంది ఏమీ అధ్యయనం చేయకుండా, ఏదీ ప్రాక్టీసు చెయ్యకుండా మేము చాలా బిజీగా ఉన్నాము అంటారు. అంటే దేనికి బిజీగా ఉన్నారు? చావటానికి బిజీగా ఉన్నారా? అందుచేత భగవంతుడు ఏమి చెప్పాడంటే నీ పొట్టకోసం ఇతరుల మీద ఆధారపడకు. నీ శరీర పోషణకు సరిపడేపని చేసుకొంటూ మిగతాకాలాన్ని నాకు ఇయ్యి. మీ డబ్బును నేను అడగటం లేదు. మీ గౌరవాలను నేను అడగటం లేదు, మీ కాలాన్ని కొంత నాకు ఇవ్వండి. కాలం అనే భిక్ష నాకు పెట్టండి అంటున్నాడు అంటే కొంతకాలాన్ని నాకు కేటాయించి, నన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి అని చెప్పటం. చాలా మందికి ఫేవరేట్ గాడ్స్ ఉంటారు. బుద్ధుడు చెప్పేది ఏమిటి అంటే ఎవరో వచ్చి మిమ్మల్ని ఉద్ధరిస్తారని, దేవతలు వచ్చి ఉద్ధరిస్తారని ఎదురు చూడకండి. మిమ్మల్ని మీరు బాగు చేసుకోవటానికి

ప్రయత్నం చేయండి. ఒకవేళ డివైన్ గ్రేస్ వస్తే సంతోషమే కాని ఏదో వచ్చి మీ నెత్తిమీద పడుతుందని కనిపెట్టుకొని ఉండవద్దు. మీ కాళ్ళమీద మీరు నిలబడండి. మీ కృషి ఏదో మీరు చేసుకోండి. అదీ బుద్ధుడు చెప్పేది. నాకు పునర్జన్మ రాకూడదు అని మీరు అనుకొన్నా ఆగదు. నాకు పునర్జన్మ వస్తుందా అని ఒకరు బుద్ధుడిని అడిగారు. ఆయన చెప్పిన సమాధానం చూడండి. చాలా బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్. నీకు శరీరం అవసరమయితే వస్తుంది, శరీరం అవసరంలేకపోతే అది రాదు అని చెప్పారు. మనందరం ఏమనుకొంటున్నామంటే శరీరం లేకపోతే ఉండము అనుకొంటున్నాము అంటే పునర్జన్మ కోరుకొంటున్నాము. శరీరం లేకపోయినా మనం ఉంటాము కాని అది మనకు తెలియటం లేదు. మనం మంచి వారికంటే చెడ్డవారినే ఎక్కువగా నమ్ముతాము. భగవంతుడు చెప్పిన మాటలను నమ్మము. ఉన్న వస్తువు మీద మనకు విశ్వాసం ఉండదు, లేని వస్తువుల మీద మనకు నమ్మకం ఎక్కువ. మనకు నమ్మకం ఉన్నా లేనిది లేనిదే. ఎటాచ్‌మెంట్ అనేది పెద్ద జబ్బు, అదే మనకు అనేక అనర్థాలను తీసుకొని వస్తుంది. మీకు ఎటాచ్‌మెంట్ లేదు అనుకో ఇంక మీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళదు.

మీకు ఎప్పుడైనా భయం వేస్తోందా అని బుద్ధుడిని అడిగారు. నతింగ్ ఆన్ ది ఎర్త్ అన్నాడు అంటే ఈ భూమి మీద నాకు భయపడే విషయం ఏమీ లేదు అంటే సంపూర్ణ వైరాగ్యం బుద్ధుడిది, వైరాగ్యంలో ఆయనకు నూటికి నూరు మార్కులు వస్తాయి. భయం వలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతాయి. చాలామందికి భయం వేస్తుంది కారణం ఏమిటి అంటే తెలియటం లేదు అంటారు. ప్రతీ మనిషికి సీక్రెట్‌బర్డెన్స్ ఉంటాయి. మన చేతులతో తీసి వాటిని అవతల పడేద్దాము అంటే అది మనకు సాధ్యం కాదు. మనలో ఉన్న సీక్రెట్ బర్డెన్స్‌ను భగవంతుడే తీసి బయట పడేయాలి కాని కేవలం మన సాధన వలన, మన తెలివితేటల వలన వాటిని మనం తొలగించుకోలేము. సీక్రెట్ బర్డెన్స్ కంప్లీట్‌గా శేషం లేకుండా కాలిపోతే గాని నీకు పునర్జన్మ ఆగదు. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు, వాడికి విపరీతమైన భయం వచ్చేస్తుంది. అన్ని భయాల కంటే మరణభయం ఎక్కువ. అంటే చావు వేరు, జీవితం వేరు అనుకొంటున్నాడు. ఈ శరీరం పోయిన తరువాత మనం ఉండము అని అనుకోవటం వలన వాడికి భయం కలుగుతోంది. శరీరం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అని వాడికి తెలియదు.

నేను ఉండను అనుకొనేది నిజం కాదు, అది ఒక తలంపు. జీవితంలో అన్నీ తలంపులే. మనం వాటిని అతిక్రమించాలి. ఈ శరీరం ఎవరిది అంటే నాది అంటాము. నాది అని ఎవరు చెపుతున్నారు. మనస్సు చెపుతోంది. ఆ మనస్సు శేషం లేకుండా నశిస్తే గాని శరీరాలు రావటం ఆగదు. నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను అని ఏసు చెప్పాడు. ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పడే దానిని మీరు అనుభవంలోనికి తెచ్చుకొంటే అప్పడు చావులేని స్థితిని పొందుతారు, ఇంక వాడికి పునర్జన్మలేదు. బుద్ధుడు స్పిరిట్యువల్ జీనియస్. ఐన్‌స్టీన్ సైంటిఫిక్ జీనియస్. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. మనిషి ఈ ఆకర్షణల నుండి ఎలా బయటపడాలి అని ఐనస్టీన్ డిస్‌కస్ చేసాడు. ఈ విశ్వాన్ని అంతా నడిపే శక్తి ఒకటి ఉంది. దానినే మనం గాడ్ అంటాము. పెర్సనల్ గాడ్‌గా ఆయన తీసుకోలేదు. విశ్వం అంతా వ్యాపించి ఒక యూనిటీ ఉంది. ఆ యూనిటీ వెరైటీని తయారు చేస్తోంది. అంటే మనషులు రకరకాలుగా కనిపిస్తున్నారు. వారి గుణాలు వేరు, రంగులు వేరు, వారి యొక్క అలవాట్లు వేరు. ఇలా వెరైటీ అంతా యూనిటీలో నుండి వచ్చింది. కాని బేసిక్‌గా ఉన్నది యూనిటీ మాత్రమే. ఈ వెరైటీ అంతా ఏమిటి అంటే మాయ. దానిలోనుండి నువ్వు బయటకు రావటానికి ఐన్‌స్టీన్ ఒక ఉపాయం చెప్పాడు. ఈ వెరైటీలో నువ్వు యూనిటీని చూడడం నేర్చుకో. అప్పడు వెరైటీలో నుండి బయటకు వచ్చేస్తావు. అప్పడు ఇంక నీకు ఎట్రాక్షన్స్ లేవు, దుఃఖం లేదు. వెరైటీలో యూనిటీని చూడగలిగినప్పడు నీకు సహజంగా భేదభావన తగ్గిపోతుంది.

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతియః**
**ససన్న్యాసీ చయోగీచ న నగ్నిర్న చాక్రియః (6-1)**

**అనాశ్రితః కర్మఫలం** కర్మఫలాన్ని ఆశించవద్దు. కర్మఫలాన్ని ఆశిస్తే అది నీకు బంధం అవుతుంది. కర్మఫలాన్ని ఆశించకుండా ఉంటే మనస్సు స్థిరంగా ఉంటుంది. కూల్‌గా ఉంటుంది. కర్మఫలాన్ని ఆశించటం వలన కర్మమీద యింటరెస్ట్ పోతుంది, నీ మనస్సు క్వయిట్‌గా ఉండదు. నీకు వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. ఫలాపేక్ష లేకుండా పని చెయ్యి. **కార్యం కర్మకరోతియః** భగవంతుడు మీ శరీరానికి ఏపని అయితే కేటాయించాడో ఆపనిని ఫెర్‌ఫెక్టుగా చెయ్యి. మీరు తల్లికి ఏదైనా సహాయం చేస్తే మీ అమ్మకు ఉపకారం చేసాను, సేవ చేసాను అంటున్నారు. అది మీ డ్యూటీ. మీ డ్యూటీని చేస్తూ నేను సెల్ఫ్‌లెస్

వర్కు చేసాను అంటారు. అది సెల్ఫ్‌లెస్‌వర్కు ఎలా అవుతుంది. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే డ్యూటీ నువ్వు చెయ్యి. నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించకుండా పరాయిధర్మం జోలికి వెళ్ళకు, ఎవరో ఏదో చేసారని నువ్వు కూడా అలా ప్రవర్తించకూడదు, అనుకరణ పనికిరాదు. భగవంతుడు ఒకో శరీరానికి ఒకో పని యిస్తాడు. భగవంతుడు నీ శరీరానికి ఏపని అయితే కేటాయించాడో ఆ పనే చెయ్యి. ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాలు అన్నీ నాకే కావాలి అంటే ఎలాగ. నీ డ్యూటీ ఏదో నువ్వు చేసుకో. ఎవరో ఏదో చేస్తే లాభం వచ్చేసింది అని మనకు చేతకాని పనులకు వెళ్ళి కలబడితే లాభం మాట అటుంచండి, ఉన్నది పోతుంది. ఫలాపేక్ష లేకుండా కర్తవ్య కర్మలను చేసేవాడు యోగి, వాడే సన్యాసి. నువ్వు కర్మ శూన్యుడిగా ఉండకు. ఆరోగ్యం ఉన్నంతకాలం నువ్వు చెయ్యవలసినపని చెయ్యి. మీరు సర్వీసునుండి రిటైర్ అవ్వాలిగాని వర్కునుండి రిటైర్ అవ్వకూడదు.

**ననిరగ్నిర్నచంక్రియః** అగ్నిహోత్రశూన్యుడిగా ఉండకు. అగ్నిహోత్రకర్మను విడిచిపెట్టవద్దు. నీ యింద్రియాలు శుచిగా ఉండటానికి, మనస్సు శుచిగా ఉండటానికి, మనస్సుకు లోచూపు కలగటానికి నువ్వు చేసే కర్మ అగ్నిహోత్రకర్మ అంటున్నాడు భగవంతుడు. కర్మవేరు, అగ్నిహోత్రకర్మ వేరు. నీ మనస్సు పవిత్రం అవ్వటానికి, చైతన్యస్థాయి పెంచుకోవటానికి నువ్వు చేసే కర్మ అంతాకూడా అగ్నిహోత్రకర్మ. నీ మనస్సును, యింద్రియాలను నియమించటం, వాటిని దహింపచేయటం తపస్సు. అసలు తపస్సులోనుండే విద్య వస్తుంది. తపస్సు చేయటం వలననే నీ మనస్సు అంతర్ముఖమౌతుంది. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా నువ్వు ట్రూత్‌ను రీలైజ్ చేసే అవకాశం లేదు. మాలో చాలా దోషాలు ఉన్నాయి అంటారు. ఆ దోషాలు గొడవెందుకు. దోషాలు అన్నీ మనస్సులో ఉన్నాయి, అవి చైతన్యంలో లేవు. నువ్వు దోషాలను చింతిస్తూ ఉంటే వాటి బలం పెరిగిపోతుంది. అలాకాకుండా నువ్వు భగవంతుడిని చింతిస్తూ ఉంటే, నీ గోల్‌ను చింతిస్తూ ఉంటే దోషాలు, బలహీనతలు అన్నీ వాటంతట అవే రాలిపోతాయి.

ఐన్‌స్టీన్ ఏమన్నాడు అంటే మీకు, నాకు, ఈ ప్రపంచానికి ఆధారంగా ఉన్నది యూనిటీ. మనకు ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో దానిని రీలైజ్ చేసేవరకు ఆకర్షణలలో నుండి బయటకు రాలేము అంటే వెరైటీలోనుండి బయటకు రాలేము. వెరైటీలో ఉన్నంతకాలం మనం అజ్ఞానంలో ఉన్నట్లే. శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను, శరీరం పుట్టినప్పుడు నేను పుట్టాను అని మనం అనుకొంటున్నాము. మనం అజ్ఞానంలో ఉన్నాము

కాబట్టి మనకు ఇలా అనిపిస్తోంది. ఈ పుట్టటాలు, చనిపోవటాలు, జీవించటాలు ఇవి అన్నీ అజ్ఞానం అనే నిద్రలో జరిగిపోతున్నాయి. అజ్ఞానం అనే నిద్రలోనుండి మేల్కొన్నాక ఇదంతా అబద్ధం అని తెలుస్తుంది. అంటే నీవు రియలైజేషన్ పొందాక ఇదంతా నిజంకాదు అని నీకు తెలుస్తుంది. రియలైజేషన్ పొందేవరకు సత్యాన్ని అసత్యం అనుకొంటావు, అసత్యాన్ని సత్యం అనుకొంటావు. ఏవో పుస్తకాలు అధ్యయనం చేయటం వలన ఇది తెలియదు. నువ్వు సత్యానుభవం పొందాలి, దానికోసం ప్రయత్నం చెయ్యి. మా జిన్నూరు అంటున్నాము అంటే ఈ శరీరమే నేను అనుకొంటున్నావు కాబట్టి జిన్నూరు కూడా నీదే అనుకొంటున్నావు. ఈ శరీరమే నేను అని ఎంత సహజంగా అనుకొంటున్నావో, లోపల ఉన్న రియాలిటీయే నేను అని అంత సహజంగా అనుకొంటే ఇంక మా ఊరు, మా దేశం ఏమిటి? ఈ దేశాలు, సరిహద్దులు అన్నీ కూడా కల్పితం. తనువు తానుకాదని తెలిసినవాడికి నేటివ్ ప్లేస్ ఏమిటి? నేటివ్ కంట్రీ ఏమిటి? ప్రపంచం అంతా వారిదే. ఏ దేశం వెళ్ళినా మన దేశమే. నేను ఇంగ్లండులో ఉన్నంతకాలం ఇండియాలోనే ఉన్నానని అనిపించిందికాని ఎక్కడో పరాయి దేశంలో ఉన్నానని ఆ ఫీలింగ్ రాలేదు. భగవాన్ శరీరం మరణించేటప్పుడు ఒక భక్తుడు ఏమన్నాడు అంటే మీరు వెళ్ళిపోతున్నారు అన్నాడు. వేర్ కెన్ ఐ గో. నేను వెళ్ళటానికి నేను లేనిచోటు అంటూ ఉంటేకదా అన్నారు భగవాన్. అంతటా ఉన్నప్పుడు ఎక్కడికి వెళతాడు. అంతటా ఉన్న వాడికి గోయింగ్ లేదు, కమింగ్‌లేదు.

మీకు సంతోషం వస్తూ ఉంటుంది, దుఃఖం వస్తూ ఉంటుంది. ఇది అంతా మనస్సే. మొత్తం డస్టు అంతా మనస్సుతోనే ఉంది. ఎక్కడ మనస్సు ఉంటే అక్కడ అశాంతి ఉంటుంది, అదే వేరుభావనను తీసుకొని వస్తుంది. అందుకే దానిని తీసి ఒక ప్రక్కన పెట్టమన్నారు. అది అంత తేలికకాదు. అది చాలాకాలం నుండి మనతో ఉంది, దానికీ మనకీ స్నేహం పెరిగిపోయింది. ఆ స్నేహాన్ని బ్రేక్ చేయటం అంత తేలిక కాదు. నీలో అజ్ఞానం ఉందని నీకు తెలుస్తోంది కదా! అందుచేత దానిని తొలగించుకోవటానికి నీ సర్వశక్తులు ఉపయోగించు. అంతేగాని ఈ అజ్ఞానం నాకు ఎప్పుడు వచ్చింది? ఎక్కడ వచ్చింది? ఎందుకు వచ్చింది? అని ఆలోచించకు. దానివలన కాలం, శక్తి వృధా అవుతాయి. ఉన్న దానిని పోగొట్టుకోవటానికి సిన్సియర్‌గా ప్రయత్నం చెయ్యి. మన శరీరం చనిపోయాక కూడా 20 రోజులో, 30 రోజులో ఏమిటి నా శరీరం ఎక్కడికి పోయింది, కనబడటం లేదు

ఏమిటి అని వెతుక్కొంటాము. ఎందుచేతనంటే 60 సంవత్సరాలో, 70 సంవత్సరాలో ఆ శరీరంలో ఉన్నాము కదా. ఇంక మనం ఆ శరీరంలోనికి వెళ్ళలేము, దానిని కాల్చి బూడిద చేసేసారు అని తెలిసాక ఇంక పాత శరీరం గొడవ వదిలేస్తాము. చనిపోయినవారికి, బతికి ఉన్నవారికి ఉన్న తేడా ఏమిటి అంటే చనిపోయినవారు బతికిఉన్నవారిని తొందరగా మర్చిపోతారు. కాని మనం చనిపోయిన వారిని తొందరగా మర్చిపోలేము. ఏదో మనతో కలిసి చాలాకాలం తిరిగి ఉంటారు, ఏదో మనం ఇబ్బందులలో ఉన్నప్పుడు సహాయం చేసి ఉంటారు. ఇలా ఏదో రూపంలో వారిని జ్ఞాపకం తెచ్చుకుంటాము.

మనలోపల ఉన్న సత్యానికి శరీరం అక్కరలేదు, మన మనస్సుకే శరీరం కావాలి. శరీరం లేకుండా మనస్సు ఉండలేదు. శరీరం మరణించాక నేను ఫలానా ఊరిలో పుట్టాలి, ఫలానా కుటుంబంలో పుట్టాలి అని సెలెక్టు చేసుకోవటానికి అవకాశం లేదు. ఇదంతా ఈశ్వరుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. నీకో ప్రణాళిక ఉంటుంది, ఈశ్వరుడికో ప్రణాళిక ఉంటుంది. నీ ప్రణాళిక, ఆయన ప్రణాళిక కలిసినప్పుడు ఇదంతా నేనే చేసాను అనుకొంటావు. నీకు అహంకారం ఉంది కాబట్టి అలా అనుకుంటావు. బుద్ధుడు ఒక మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టికూడా నేను రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపు ఆయనకు ఎప్పుడు రాలేదట. ఎందుచేతనంటే అక్కడ దేహగతమైన నేను లేదు. అందుచేత నేను ఏదో రాజ్యాన్ని త్యాగం చేసాను అన్న తలంపు ఆయనకు లేదు. అలా అనుకునే వాడు చచ్చిపోయాడు ఇంక అనుకొనేది ఏముంది? ఏమీ లేదు. మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో జాగ్రత్తగా పరిశీలన చేసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. అప్పుడు మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. ఆత్మజ్ఞానం పొందటానికి శారీరకఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. మీ ఇంటి దగ్గర డబ్బు ఉంటే ఉండనివ్వండి, మీ హృదయంలో మటుకు ప్యూర్‌గా ఉండండి, పూర్‌గా ఉండండి. అగ్నిహోత్రకర్మకు మీరు ప్రాముఖ్యత ఇవ్వండి. మీరు బాగుపడే లక్షణాలను, దైవీగుణాలను జీవితం పొడుగునా పెంచుకొంటూ రండి. అది అగ్నిహోత్రకర్మ. అగ్నిహోత్రకర్మను విడిచిపెట్టవద్దు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రీ నాన్నగారు

భక్తులచే ప్రేమతో 'నాన్నగారు' అని పిలువబడే సద్గురు శ్రీనాన్నగారికి ఎట్టి జటిలమైన సాధనలు లేకుండానే, సుమారు 56 సంవత్సరముల క్రితము, భగవాన్ శ్రీ రమణమహర్షియొక్క దివ్యానుగ్రహస్పర్శ లభించినది. అప్పటినుండి శ్రీనాన్నగారు అనేక ప్రాంతములలో జ్ఞానయజ్ఞములద్వారా తత్త్వబోధను అందిస్తున్నారు. శ్రీనాన్నగారి దివ్యబోధ అనేకులకు మనశ్శాంతిని ప్రసాదిస్తూ, మనస్సుకు లోచూపు నేర్పుతూ, ఆధ్యాత్మిక ఉన్నతికి బాటవేయుచున్నది. శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, వారి కరుణాపూరిత చూపు, సమక్షము, ఎంత మహత్తరమైనవో! భక్తులందరికి అనుభవైక వేద్యమే! జలమయ తీర్థములును, మట్టి, శిలామయ దేవతలును, కాలాంతరమున పావనముగావింపగలవు, కాని సత్పురుషులు దర్శనమాత్రమున మనలను పునీతులను చేయుదురు; అన్న శ్రీ రమణ వాక్కుకు నిదర్శనమే శ్రీ నాన్నగారు. శ్రీనాన్నగారి దివ్యాశీస్సులతో అనేక ప్రాంతములలో శ్రీరమణ సత్సంగములు ఏర్పడి ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడుచున్నవి. శ్రీనాన్నగారి ప్రవచనములు మరియు 'రమణ భాస్కర' పత్రిక ద్వారా అనేకమందికి మానసిక ఆరోగ్యము కలుగుతోంది. గురుబోధ శ్రవణము, మననము మరియు సత్సంగముల ద్వారా మనస్సు ఎప్పటికప్పుడు పరిశుద్ధమవుతుంది. ఆత్మజ్ఞాన సముపార్జన కన్న గొప్పపని ఈ లోకంలో ఏదీ లేదని బోధిస్తూ, అమృతానుభవం పొందడానికి ఏ వాసనలు, విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోడానికి మనము చేసే ప్రయత్నమే సాధన అంటారు, శ్రీనాన్నగారు. భగవంతుడు ఉన్నాడా? లేడా? అని కాదు నీవు ఆలోచించవలసింది అసలు నీవు ఒక వ్యక్తివి అంటూ భగవంతునికన్న వేరుగా ఉన్నావా? అని ఆలోచించాలి అంటారు శ్రీనాన్నగారు. శ్రీనాన్నగారి జీవనసరళి భక్తకోటికి కరదీపిక. మనమధ్య నడియాడుతున్న అట్టి మహాత్ముని స్ఫూర్తితో మనం జీవించి, తరిస్తే అదే మనము వారికి సమర్పించే గురుదక్షిణ.

ఓం తత్సత్

(ది 23-09-2013 శ్రీ నాన్నగారి జన్మదినం సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# అహంకారాన్ని వదిలించుకోవటానికి - గురువే సరియైన స్థావరం

మన దేహాభిమానమే అహంకారం. దానికి మించిన నరకం ఏదీ లేదు. ఇదిలేదు, అదిలేదు అనే దురాశే మనలను దుఃఖమయం చేస్తుంది. ప్రకృతి మనుషులకు దూరంగా ఉండాలి. గురువుపై దృష్టి నిలిపిన వారే సుఖంగా ఉంటారు. ఇదిలేనివారు బ్రతికిఉండగానే చనిపోయిన వారితో సమానం. ఎవరి సాంగత్యంలో ఆత్మపరివర్తన కలుగుతుందో వారే నిజమైన గురువులు. వారు దరిద్రానికి చలించరు. భాగ్యానికి పొంగరు. దయ, ఓర్మి, స్వార్థంలేని ప్రేమతో, ఎవరినీ శత్రువుగా చూడక ప్రశాంతంగా స్థిరంగా పరమాత్మలో నిమగ్నమై ఉంటారు. వారితో అనుబంధం కలిగి ఉండాలి. అప్పుడు అది జ్ఞానహేతువవుతుంది. వారు చేసే మంచిపనులను చింతిస్తూ ఉంటే మనలో దయ-ధర్మాలు అలవడతాయి. వారి సాన్నిధ్యం వేలకొలది జనాలను పరిశుద్ధం చేస్తుంది. నిజం చెప్పాలంటే 'శిష్యుడు సంసిద్ధంగా ఉండగానే గురువు ప్రత్యక్షం అవుతాడు'. గురువు మనకు ఎంతెంత బోధసహాయాలు చేశారో మనం ఇతరులకు చేతనైనంత సహాయ సహకారాలు చేస్తే గురువు ఋణం తీరుతుంది. గురువు నిరంతరంగా తన శిష్యుడిని పరిశీలిస్తూనే ఉంటారు. మన అవసరానికి ప్రతిస్పందిస్తూ ప్రవచించాలి. ఆతనిలో సందేహాలు అడిగినా అడగకపోయినా వదలకూడదు. లేకపోతే అవి వేధిస్తాయి, లేదా కొన్ని జన్మలు ఎత్తవలసి ఉంటుంది. గరువు మన గతవాసనలను, వర్తమాన నడవడికను, భవిష్యత్తును చూస్తూ ఉండాలి. అన్ని అవసరాలను గుర్తించాలి. గురువు మన సంపూర్ణప్రయాణపు ఆవశ్యకతలనన్నింటికోసం, సౌకర్యాలు అమర్చిపెడుతూ ఉంటాడు. గరుబాధ్యత ముళ్ళకిరీటం. మొదట్లో గురువు మనలను ఆకర్షించుకొని మనలను నమ్మించే పనిచేస్తూ మరులుగొలిపి బాగా దగ్గరకు చేర్చుకొంటాడు. మన ప్రారబ్ధపు స్తుతి దెబ్బలు మహాఆవేశంతో కొడతారు. అలా చెయ్యకపోతే మనం తప్పించుకొని పోతాము. ఆయన సామీప్యంలో వదలకుండా ఉంచుకోవటానికే ఆ దెబ్బలు. ప్రారబ్ధం ఖర్చు అయితే కాని కష్టాలు తీరవు. ఆ ప్రక్షాళనను ప్రేరేపించే కార్యము వల్ల శిష్యుడిలో పరివర్తన వస్తుంది. పొద్దుతిరుగుడు పువ్వు సూర్యుడు ఎటు తిరిగితే అటు తిరుగుతుంది. శిష్యుడు గురువువైపే నిరంతరం దృష్టిని నిలపాలి. నిజమైన శిష్యుడు ఎవరంటే జ్ఞానాన్ని ఆర్జించుకోవటం పట్ల అమితోత్సాహం. ఆ దైవాన్ని ఆ జీవధార ఊటను గ్రోలాలనే దప్పికతో ఉన్నవాడే. గురుశక్తి సాగరంలో కలిసిపోవాలనుకొనేవాడే. సత్సంగము అంటే ఆయన వద్ద కూర్చోవటం కాదు. ఆయన రుచి వ్యాపిస్తుంది. సత్యాన్ని తెలుసుకొన్నవారి యొక్క తరంగాల్లో మునిగిపోవటం. మన అంతరంగంలో నిద్రావస్థలో ఉన్న, ఆయన విస్మృతి తరంగాలు చలింపచేయబడతాయి, ప్రకంపిస్తాయి. కేవలం గురువును దర్శించటం ద్వారా ఆయన ముందుకు వెళ్ళారు అని చూడటం ద్వారా మన అంతరంగంలో అలా మనం కావాలి అనే సవాలు రేపుతుంది. అపుడు నిలవరించటం కష్టం. గురువు మాటలను అధికంగా వింటూ ఉండటం కాదు. ఆయన సమక్షాన్ని గ్రోలడం. గురువు మన అంతరంగంలోకి లోతుగా రావటానికి అనుమతించటం. ఆ సంగమం కొద్దిసేపైనా మనం లోపలకి ప్రవేశిస్తాము. గురువుయొక్క కళ్ళను చూస్తాము. వారి మాటలు చెవుల ద్వారా వింటాము. అవి అంతిమ సత్యానికి చేరుస్తాయి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**